ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
బుధవారం 16 అక్టోబరు 2024



రేపు జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలను ఈ నెల 17న జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించను న్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, వెంకటేష్‌లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒకటి అక్టోబరు 2010 తర్వాత జన్మించిన వారు అర్హులని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు అన్ని ధృవ పత్రాలతో పోటీలకు హాజరు కావాలని కోరారు.

న్యూస్ బాక్స్

బీఆర్ఎస్ కార్యకర్త అరెస్టు

రాయికల్, అక్టోబరు 15: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అనుమల్ల మహేష్‌ను మంగళవారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. ఎంపీ రఘునందన్ రావుపై సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా పోస్టు చేసినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురిపై ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా అనుమల్ల మహేష్ సైతం ఉన్నాడు. పోలీసులు ఈ సంఘటనపై పూర్తి విచారణ చేస్తున్నారని సమాచారం

సెల్‌ఫోన్ అప్పగింత

మల్యాల, అక్టోబరు 15: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన పెగడపల్లికి చెందిన కవిత అనే భక్తురాలు తమ సెల్‌ఫోన్‌ను తన కుమారుడికి ఇచ్చింది. అతను ఆలయ ఆవరణలో పోగొట్టుకోవడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది కి తెలిపారు. దీంతో పరిసరాల్లో వెతుకగా హోంగార్డు రమేశ్‌కు ఫోన్ దొరికింది. పోలీస్‌అవుట్ పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్‌కు దాన్ని అప్పగించడంతో విచారణ జరిపి భక్తురాలికి అందించారు.

పెగడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన గడ్డం తిరుపతి అనే వ్యక్తి పోగొట్టుకు న్న మొబైల్ ఫోన్‌ను మంగళవారం ఎస్ఐ రవికిరణ్‌ను బాధితుడికి అందజేశారు.

ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిసిన కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ మంగళవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన బద్రి వెంకటి అతిగా మద్యం సేవించి వాహనం నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు.

ఇందిరమ్మ కమిటీలు

- జిల్లాలో దాదాపుగా పూర్తయిన ప్రక్రియ
- కలెక్టర్‌కు సమర్పించడానికి సిద్ధమైన ఫైల్



జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గాను ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో దాదాపుగా ఇందిరమ్మ కమిటీల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. కలెక్టర్ సత్య ప్రసాద్‌కు సమర్పించడానికి సంబంధిత ఫైల్‌ను అధికారులు సిద్ధం చేశారు. గృహ నిర్మాణ శాఖ, పంచాయ తీ, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్నారు. ఇటీవల దసరా సందర్భంగా ప్రభుత్వం మరో తీపి కబురు వినిపించింది. అసెంబ్లీ ఎన్నికల హామీ నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేయడంలో భాగంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించనున్నారు. ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ. 5 లక్షలు చెల్లించనుంది. ఇందుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఊరూరా ఇందిరమ్మ కమిటీలు నియమించి సదరు కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొం దించింది. ఆయా కమిటీలు, అధికారులే లబ్ధిదారులను గుర్తిస్తారు. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

తొలిదశలో...

జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలు ఉన్నాయి. అదేవిదంగా సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలు, కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల మం డలాలు ఉన్నాయి. తొలి విడతలో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున, జిల్లాకు దాదాపుగా 12,000 ఇళ్లు మంజూరు చేయనున్నారు. జిల్లాలోని 380 పంచాయతీలు, 5 మున్సిపాలిటీల్లోని 134 వార్డుల్లో కమిటీల నియామకానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జగిత్యాల మున్సిపల్‌లో 48 వార్డులు, మెట్‌పల్లి మున్సిపల్‌లో 26 వార్డులు, కోరుట్ల మున్సిపల్‌లో 33 వార్డులు, రాయికల్ మున్సిపల్‌లో 12 వార్డులు, ధర్మపురి మున్సి పల్‌లో 15 వార్డులలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

కమిటీల్లో వీరికి చోటు...

జిల్లాలోని గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధి కారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో పంచాయతీ ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీలో చోటు కల్పిస్తున్నారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, గ్రామాభివృద్ధిపై అవగాహణ కలిగిన ముగ్గురు గ్రామస్థులు (ఇందులో ఒకరు బీసీ, ఒకరు ఎస్‌సీ) కమిటీలో ఉండే విదంగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీ సెక్రటరీగా ఇందిరమ్మ కమిటీకి కన్వినర్‌గా వ్యవహరించనున్నారు.

మున్సిపాలిటీల్లో ఇలా...

మున్సిపాలిటీల పరిధిలో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా, ఇరువురు మహిళా పొదుపు సంఘాల సభ్యులు (ఇందులో ఒకరు బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీలలో ఒకరు), వార్డు అధికారి మెంబర్ కన్వీనర్ కమిటీల్లో ఉంటారు. వీరు గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయను న్నారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే...వారిపై ఫిర్యాదు చేసి..నిధులు రికవరీ చేసే అధికారం వీరికి ఉంటుంది. ఇందిరమ్మ కమిటీల జాబితాను, అధికారులు రూపొం దించిన జాబితాను కలెక్టర్‌కు సమర్పించిన అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇలా...

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అధికారులు పలు నిబంధనలు పాటించనున్నారు. లబ్ధిదారుడు తప్పనిసరిగా పేద, మధ్య తరగతి వారై ఉండాలి. జాతీ య ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. అద్దె ఇళ్లలో నివాసముంటున్న వారికి ప్రాధా న్యం ఇవ్వనున్నారు. ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం ఉంటుంది. సొంత ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం ఉన్నవారిని సైతం ఎంపిక చేయనున్నారు.

జాబితాను సిద్ధం చేస్తున్నాము



ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల జాబితాను సిద్ధం చేస్తున్నాము. దాదాపుగా అన్ని పంచా యతీలు, మున్సిపల్ వార్డుల్లో జాబితాలు సిద్ధమయ్యాయి. ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ కార్యాలయంలో సమర్పించనున్నాము. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదం పొం దాల్సి ఉంది. ఇందుకు అవసరమైన కసరత్తులు చేస్తున్నాము.

- గౌతమ్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

కిక్కిరిసిన జగిత్యాల బస్టాండ్



రద్దీగా మారిన జగిత్యాల బస్టాండ్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15: దసరా పండుగ ముగిసి మూడు రోజులు అవుతున్నప్పటికీ జగిత్యాల బస్టాండ్ ఇప్పటికీ ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. జిల్లాలో కొన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ గత గురువారం నిర్వహించుకోగా, జగిత్యాల చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం బతుకమ్మ పండుగ నిర్వహించుకు న్నారు. అయితే సోమవారం బతుకమ్మ పండుగ జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి తమ గ్రామాలకు పండుగ నిమిత్తం వచ్చిన వారు మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో జగిత్యాల బస్టాండ్ కిక్కిరిసి పోయింది. జగిత్యాల నుంచి కరీంనగర్ ఎక్స్‌ప్రెస్ బస్సులో రూ.70 టిక్కెట్ ఉండగా, ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు వేసి జగిత్యాల నుంచి కరీంనగర్‌కు అదనంగా రూ.40 వసూలు చేసినట్లు ప్రయాణికులు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఉప వైద్యాధికారి శ్రీనివాస్

కొడిమ్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్య పరిశు భ్రతపై అవాగాహన కలిగి ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వ్యక్తిగత ఆరోగ్య పరిశుభ్రత కార్యక్రమంలో బాగంగా మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కలిపించారు. ఈ సందర్భం గా జిలా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ చేతులు శుభ్రత, శుభ్రమైన బట్టలు వేసుకోవటం వలన కలుగు ప్రయోజనాలను వివరించారు. వ్యక్తిగ శుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. సమాజం ఆరోగ్యం కూడ బాగుంటుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత లేని కార ణంగా పలు రకాల వ్యాదుల బారిన పడుతారన్నారు. ఈ అవగా హన కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వరీ,సీహెచ్‌వో రాజశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్ వైజర్ వెంకటనర్సమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశోధక పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర సహాయక ఆచార్యులు డాక్టర్ నీలి వాసవి రచించిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.రామకృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. నిజామాబాద్ భూగర్భ జలాలు, నేలపై ఘన వ్యర్థాలు, లీకేట్ ప్రభావం, స్థిరమైన నిర్వ హణకు మార్గాలు అనే పరిశోధక పుస్తకాన్ని నీలివాసవి రచించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ ఘన వ్యర్థాలను పర్యావరణంలోకి విడుదల చేయడానికి బదులుగా వాటిని శుద్ధి చేయ డం, రీసైక్లింగ్ చేయడం అత్యవసరమని లేకుంటే భావితరానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన ఆచార్యులు చంద్రయ్య, ప్రమోద్ కుమార్, డాక్టర్ వి.వరప్రసాద్, రామచంద్రం, నీరజ, సుజాత, రహీం, శ్రీలత, జమున, సునీత, జ్యోత్స్న పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

- ఎస్పీ అశోక్ కుమార్
- మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయం తనిఖీ

8



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

ఫోర్జరీ సంతకాలతో ఇల్లు రిజిస్ట్రేషన్

- ఫేక్ సర్టిఫికెట్లపై ఎంపీడీవో విచారణ
- లోన్ కోసం తప్పుడు పత్రాల తయారీ



గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఎంపీడీవో

8

వైద్యులపై దాడులను అరికట్టాలి

8



నిరసన తెలుపుతున్న వైద్యులు

అంజన్న సన్నిధిలో పీఏసీ చైర్మన్



పీఏసీ చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, శేర్‌లింగం పల్లి ఎమ్మెల్యే అరికపుడి గాంధీ మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. తన జన్మదినం సందర్భంగా కొండగట్టుకు వచ్చిన గాంధీకి ఎమ్మెల్యే సత్యంతో పాటు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆల య అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించగా ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్క రించారు. అరి కపుడి గాంధీ వెంట పెద్ద ఎత్తున అనుచర గణం రావడంతో ఆలయం నిండి పోయింది. ఎమ్మెల్యేల పూజల సందర్భంగా దాదాపు ఇరవై నిమిషాల పాటు దర్శనాలు నిలి పివేయగా క్యూలైన్‌లో భక్తులు ఊసురుమంటూ కూర్చున్నారు. అంజన్న దర్శనం అనంతరం తిరుగుపయనంలో చైర్మన్ గాంధీ, ఎమ్మెల్యే సత్యం బేతాళుడిని కూడా దర్శించుకున్నారు. వారి వెంట మల్యాల, కొడిమ్యాల మండలా ల నాయకులు ఉన్నారు.

●కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ తదితరులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది

సార్ మా ఊరికి బస్సు నడపండి

- ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫోన్‌లో విన్నవించిన గ్రామస్థులు

సారంగాపూర్, అక్టోబరు, 15 : సార్ మా ఊరికి ఆర్టీసీ బస్సు నడపడం లేదు సార్. దీంతో విద్యార్థులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు మండలంలోని బట్టపల్లి గ్రామస్థులు ఫోన్ చేసి సమస్యను విన్నవించారు. వివరాల్లోకి వెళితే మండలంలోని బట్టపల్లి గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సు నడిచేది. కొన్నేళ్లుగా బస్సు రావడం లేదు. బస్సు రాకపోవడంతో విద్యార్థులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కొందరు గ్రామస్థులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు మంగళవారం ఫోన్ చేసి తమ సమస్యను వివరించారు. తమ గ్రామానికి ఐదు ట్రిప్పుల బస్సు సౌకర్యాం కల్పించాలని కోరారు. గ్రామస్థుల ఇబ్బందులను అర్థం చేసుకుని స్పందించిన ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్ జగిత్యాల డిపో మేనేజర్‌కు బట్టపల్లి గ్రామానికి ఐదు ట్రిప్పుల బస్సు నడిపించేల చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌టీసీ ఎండీ సజ్జనర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులం సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం

- విద్యార్థులకు అన్ని రకాల వసతులు ● మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అన్ని రకాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించామని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గురుకుల పాఠశాలను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. దసరా సెలవులు పూర్తి చేసుకుని తిరిగి ప్రారంభించినం దున గురుకులానికి ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు తరలివస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని రకాల వసతులు కల్పించామన్నారు. గురుకులంలో ఎమైన సమస్యలు, చేపట్టిన పనుల వివరాలు, కావాల్సిన వసతుల గురించి ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులను అడిగి తెలసుకున్నామన్నారు. గురుకులంలోని నూతన భవనంలో విద్యార్థులకు కావాల్సిన మరుగుదొడ్లు, డబుల్ కాట్ బెడ్స్‌లను ఏర్పాటు చేయడంతో పాటు కరెంట్, ఫ్లంబింగ్ పనులు పూర్తి స్థాయిలో వసతులను కల్పించినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఏమైనా పనులు మిగిలి ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, వాటిని త్వరలోనే పరిష్కరిం చడానికి అధికార యంత్రంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. గురు కులంలో వి ద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించడంతో ఉపాధ్యాయుల సూచనల మేరకు వి ద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్నారన్నారు. సెలవులు పూర్తియైనందున విద్యా ర్థులు మొదటి రోజు పూర్తి స్థాయిలో రాలేదని, రాని వారికి ఉపాధ్యాయులు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి ఎంపీడీవో రామకృష్ణ, రేవెన్యూ డీటీ రా జుమహ్మద్, ఆర్ఐ ఉమేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దాపూర్ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

నేరెళ్ల పీహెచ్‌సీ వద్ద మందు బాబుల వీరంగం

ఆసుపత్రి కిటికి అద్దాలు ధ్వంసం

ధర్మపురి, అక్టోబరు 15: ధర్మపురి మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీ వద్ద మందు బాబులు వీరంగం చేసి మంగళవారం సాయంత్రం ఆసుపత్రి కిటికీ అద్దాలు ధ్వంసం చేశారు. సాయంత్రం ఆయా గోస్కుల భూమక్క ఆసుపత్రికి తాళం వేసి ఇంటి వచ్చింది. కొంత సేపటికి ఆసుపత్రి ఆవరణలో ముగ్గురు యువకులు చిత్తుగా మద్యం సేవించారు. తాగిన మైకంలో ఆసుపత్రి కిటికీ అద్దాలు పగులగొట్టారు. ఆసుపత్రి వద్ద నుంచి శబ్దాలు రావడంతో గ్రామస్థు లు అక్కడి చేరుకుని పోలీసులకు సమాచారం అం దించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకోగా మరొక యువకుడు పరారయ్యాడు.



తరగతి గదిలో చెల్లాచెదురుగా పడవేసిన ఫైళ్లు

ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం

రాయికల్, అక్టోబరు 15: మండలంలోని తాట్లవాయి గ్రామంలో గల ప్రాథమిక, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో గుర్తు తెలియని ఆకతాయిలు విధ్వంసం సృష్టించారు. 8 ఫ్యాన్‌లను, బెంచీలను, తరగతి గదిలో డోర్లను కొన్ని చోట్ల పూర్తిగా కొన్ని చోట్ల పాక్షికంగా ధ్వంసం చేశారు. దీంతో లక్షకు పైగా నష్టం చేకూరింది. దీంతో పాఠశాల సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వారు విచారణ జరుపుతున్నారు.

క్రైం కార్నర్

కొండగట్టులో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన ఈవో

● 'అన్నదానం' సరుకులు చోరీ ఘటనలో చర్యలు

మల్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంలో వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన ఈవో రామకృష్ణరావు అన్నదానం ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్ కె.రాములుపై సస్పెన్షన్ వేటు వేశారు. నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే 50కిలోల బియ్యంతో పాటు పలు ఇతర సరుకులను ఈ నెల 9న వంటగ్యాస్ సరఫరా చేసే ఆటోలో తరలించిన్నట్లు పలు వురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేసి 24గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలలోనూ సరుకుల తరలింపు రికార్డు అయినట్లు అధికారుల పరిశీలనలో తేలడం, ఆటో డ్రైవర్ సురేశ్ వాగ్మూలం మేరకు మంగళవారం రాములను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో పేర్కొన్నారు. గతంలోనూ అతను విధులు నిర్వహించిన చోట కూడా రాములు అన్నదానం సరుకులు మా యం చేసినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం నుంచి కొండగట్టుకు బదిలీపై వచ్చారు. రాగానే గతంలో తాను అక్కడ నిర్వహించిన అన్నదానం విభాగం కోసం పైరవీలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే మొదట ఆ విభాగం కేటాయించిన ఉద్యోగిని విధుల్లో చేరక ముందే ఆయనను మార్చి రాములుకు అన్నదానం విభాగానికి అప్పగించారనే విమర్శలు ఉన్నాయి. కాగా రాములు స్థానంలో మరో జూనియర్ అసిస్టెంట్ ధర్మేంధర్‌కు అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి అమ్మకం విషయం లో తల్లిని రాయితో గాయ పరిచి తండ్రిని కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్య తన చిన్న కుమారుడు ప్రభుదాస్‌కు మధ్య భూతాగాలు ఉన్నాయి. పోచయ్య తన పేరిట ఉన్న రెండు ఎకరాల భూమి అమ్మకం విషయంలో పగ పెంచుకున్న కుమారుడు ప్రభుదాస్ తన తల్లి శాంతను రాయితో కొట్టి గాయపరిచి తండ్రి పోచయ్యను కర్రతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు గొల్లపల్లి పోలీసులకు 23 నవంబరు 2008న ఫిర్యాదు చేయగా అప్పటి డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ బా బు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుత పో లీసులతో పాటు సీఎంఎస్ ఎస్సై రాజు నాయక్, కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లిఖార్జున్ కేసు వాధించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభుదాస్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న ఆలయం ఎదుట గల ప్రధాన వీధిలో ఉన్న కొబ్బరికాయలు, బెల్లం దుకాణాల్లో తాత్కాలిక కూలీగా పనిచేసే మైత్రి నవీన్ (19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 27 సంవత్సరాల వయసున్న ఓ వివాహేత పట్ల నవీన్ ఆకర్షితుడయ్యాడు. తాను ఆమెను ప్రేమిస్తున్నానంటూ తరచూ మాట్లాడేందుకు ప్రయత్నించేవాడు. ఈ క్రమంలో సదరు మహిళ బతుకమ్మ పండుగ కోసం ఊరికి వెళ్లగా తనను చూడాలని ఉందంటూ ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడడానికి ఆమె నిరాకరించడంతో పాటు ఇకముందు తన వద్దకు రావద్దని తనతో మాట్లాడేందుకు ప్రయత్నించవద్దని తేల్చి చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో నవీన్ తన చేతిని కోసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. అనంతరం కనిపించకుండా పోయిన ఆ యువకుడు మంగళవారం నాడు వేములవాడ గుడి చెరువులో శవమై తేలాడు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సదరు మృత దేహం నవీన్‌దిగా గుర్తించారు. గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కూడా నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోగా కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. నెలరోజుల వ్యవధిలోనే రెండోసారి ఆత్మహత్యయత్నం చేసి బలవన్మరణానికి పాల్పడడం చర్చనీయాం శంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.



అందమైన అల్లిక..

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల రోడ్డు.. పక్కన ఉన్న ఓ చెట్టు వద్ద అందమైన బుట్టలు అల్లుతూ దంపతులు కనిపిస్తారు. వెదురుతో తయారు చేస్తున్న ఆ బుట్టలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మహిళలు గుడికి వెళ్లేటప్పుడు తీసుకెళ్లే సామగ్రిని ఈ బుట్టలో పెట్టుకుని వెళ్లవచ్చు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రామా పురం గ్రామానికి చెందిన దేవరకొండ ప్రభాకర్ దంపతులు జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఓ చెట్టు కింద వెదురు బుట్టలు తయారు చేస్తున్నారు. బుట్ట అల్లిక పూర్తయ్యాక వాటికి కలర్ వైరును చుట్టడంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చాలా మంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బుట్టను 150 రూపాయలకు అమ్ముతున్నారు. దంపతులిద్దరూ రోజుకు ఎనిమిది బుట్టల వరకు అల్లుతున్నారు. ఇవే బుట్టలు బయట దుకాణాల్లో రెం డు వందల రూపాయలకు పైగా అమ్ముతారని, తామే తయారు చేస్తు న్నాం కాబట్టి 150 రూపాయలకే ఇస్తున్నామని ప్రభాకర్ తెలిపాడు.



బుట్ట అల్లుతున్న ప్రభాకర్

ఆటే వారికి ఉపాధి బాట

● ఖోఖో, ఉషు పోటీల్లో నైపుణ్యం

● జాతీయస్థాయిలో ప్రతిభ

● ఒకరికి రైల్వేలో, మరొకరికి ప్రైవేటులో కొలువు

● కోచ్‌లుగా ప్రత్యేక గుర్తింపు

ఇల్లంతకుంట/గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటలపై ఉన్న ఆసక్తి వారి ఉపాధికి బాటలు వేసింది. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించారు. ఉద్యోగాలు చేస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన ఆనంద్, గంభీ రావుపేటకు చెందిన రాణా విక్రమ్ గాంధీ తాము ఎంచుకున్న రంగంలో ఆత్మవిశ్వాసంతో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన పండుగు కనుకవ్వ, నర్సయ్య దంపతుల మూడో కుమారుడు ఆనంద్‌కు ఆటలంటే ఇష్టం. ఏడోతరగతి వరకు వాణీనికేతన్ హైస్కూల్ చదివిన ఆనంద్ అనంతరం జిల్లాపరిషత్ పాఠశాలలో చేరాడు. జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు పిల్లలకు ఆటలాడిస్తుండగా ఆనంద్‌లోని ప్రతిభను గుర్తించి మెలుకవలు నేర్పించాడు. దీంతో కాకినాడలోని స్పోర్ట్స్ అకాడమీలో సీటు సాధించిన ఆనంద్ పదోతరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్‌లో డిగ్రీ రెండో సంవత్సరం పూర్తి చేస్తుండగానే పలు పోటీలలో సత్తాచాటాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఖోఖోలో ప్రతిభ కనబరిచాడు. 2008లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో 18 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం పొందాడు.



సీనియర్ జాతీయ జట్టుకు కోచ్‌గా క్రీడాకారులతో ఆనంద్



మాజీ లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను నుంచి ట్రోఫీ కప్ అందుకుంటున్న ఆనంద్

ఉత్తమ ప్రదర్శన

ఖోఖోలో ఆనంద్ అనేక సందర్భాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సబ్ జూనియర్స్ నేషనల్స్, గ్రామీణ క్రీడల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. నాలుగు సార్లు జూనియర్ నేషనల్స్, యూనివర్సిటీ నేషనల్స్, నేషనల్ గేమ్స్‌తోపాటు ఇన్విటేషన్స్ టోర్నీలో 12సార్లు పాల్గొన్నాడు.

భారత ఖోఖో జట్టుకు నాయకత్వం

నాందేడ్‌లోని సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ సీనియర్ జాతీయస్థాయిలో వరుసగా ఏడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. 2016లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 3వ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భాతర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ పోటీల్లో భారత్, మలేషియా, సింగపూర్, కొరియా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్స్‌లో శ్రీలంకపై, ఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 5 పాయింట్లు సాధించి గోల్డ్‌మెడల్ సాధించడంలో ఆనంద్ క్రీయాశీలకంగా వ్యవహరించాడు. నాటి లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చేతుల మీదుగా భారతజట్టు ట్రోఫీ అందుకుంది.

తెలంగాణ జట్టుకు ఖోఖో కోచ్‌గా

నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన ఆనంద్ తెలంగాణ సీనియర్ జట్టుకు ప్రస్తుతం ఖోఖో కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఖోఖో క్రీడకు మరింత ప్రాధాన్యం పెంచే క్రమంలో 2018లో తీసుకొచ్చిన అల్టిమేట్ ఖోఖోలో చెన్నై క్విక్‌గన్స్‌టీంకు ప్రాతినిధ్యం వహిస్తూ రాణిస్తున్నాడు.

ఖోఖో క్రీడాకారులకు అవకాశాలు

పండుగు ఆనంద్‌కుమార్, జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఇల్లంతకుంట



గతంలో ఖోఖో క్రీడకు అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. స్పోర్ట్స్ కోటాలో కేవలం రైల్వేలోనే ఉద్యోగాలు లభించేవి. నేడు పరిస్థితి మారింది. అల్టిమేట్ ఖోఖో రావడంతో అనేక మంది ఖోఖో పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారు. పట్టుదల, సరైన దిశానిర్దేశం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. భారత జట్టుకు నాయకత్వం వహించడం జీవితంలో మరిచిపోలేనిది. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు ప్రోత్సాహంతోనే ఉన్నతస్థాయికి చేరుకున్నాను.



ఉషు పోటీల్లో శిక్షణ తీసుకుంటున్న రాణా విక్రమ్‌గాంధీ

జాతీయ స్థాయి ఉష్ పోటీల్లో గంభీరావుపేట యువకుడు

పట్టుదల ఉంటే రాణించవచ్చని, ఆటలను ఉపాధికి బాటలుగా మల్చుకోవచ్చని నిరూపించాడు గంభీరావుపేటకు చెందిన క్రీడాకారుడు రాణా విక్రమ్ గాంధీ. వ్యవసాయ కుటుంబ నుంచి వచ్చిన విక్రమ్‌గాంధీ చిన్నతనంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాడు. కుంగ్ ఫూ, జూడో, ఫెన్సింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో రాణించి పలువురి చేత భేష్ అనిపించుకున్నాడు. పద్దెనిమిదేళ్ల వయస్సు నుంచి ఉషు క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోచ్, జిల్లా ఉషు సంఘం కార్యదర్శి భారా విద్యాసాగర్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఉషులో మెలకువలను నేర్చుకుని ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ తరఫున మూడు రాష్ట్ర, మూడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు.

ప్రస్తుతం జాతీయస్థాయి ఉషు క్రీడకు కోచ్‌గా వ్యవహరిస్తూ న్యాయ నిర్ణేతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2018లో ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం 33 ఏళ్ల వయ స్సు ఉన్న రాణా విక్రమ్‌గాంధీ చొప్పదండిలోని ప్రైవేటు పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 2011 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో హరిద్వార్‌లో జాతీయ స్థాయిలో రజతం, 2011 అక్టోబర్‌లో హైదరాబాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2011 డిసెంబరులో పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం, 2012 ఫిబ్రవరిలో కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో రజత పథకాలు సాధించాడు. అనేకసార్లు రాష్ట్ర ఉషు జట్టుకు ప్రాతినిథ్యం వహించి మన్ననలు పొందాడు.

జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లోపం

ప్రారంభం కాక ముందే సైడ్ వాల్స్‌కు పగుళ్లు



ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా రహదారి నిర్మాణం



బ్రిడ్జి సైడ్ వాల్‌కు పగుళ్ళు



నిర్మాణంలోవచ్చిన పగుళ్ళు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 563 రహదారి పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రారంభం కాక ముందే పగుళ్ళు ఏర్పడుతున్నాయి. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారు లోని మానేరు బ్రిడ్జి సమీపంలో రహదారి పనుల్లో భాగంగా సైడ్ వాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా బొమ్మకల్ శివారు నుంచి మానకొండూర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. సైడ్‌వాల్స్‌కు అప్పుడే పగుళ్లు వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరీంనగర్‌కు రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోట్

మానేరు జలాశయంలో 70 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు కరీంనగర్‌కు ప్రభుత్వం నూతన రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటును అందించింది. ఈ రిమోట్ బోయ్ బోట్ ఖరీదు సుమారు 5 లక్షల వరకు ఉంటుంది. వరదనీటిలో, జలాశయాల్లో ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు ఈ లైవ్‌బోయ్ బోటును రిమోట్‌తో ఆపరేట్ చేసి నీటిలో ఆపదలో ఉన్న వ్యక్తి వద్దకు పంపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. ఈ లైవ్‌బోయ్ బోట్‌తో 800 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా రిమోట్ ఆపరేషన్ ద్వారా రక్షించేందుకు అవకాశం ఉంది. ఈ లైవ్‌బోట్ ఆపరేట్ చేసే విధానం, ఆపదలో ఉన్న వ్యక్తులను రక్షించే విధానం, నిర్వహణ తదితర అంశాలపై కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో కరీంనగర్ డివిజన్ అగ్రిమాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 మంది ఫైర్ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల మూడు జోన్‌లకు సంబంధించిన ఏడు జిల్లాలలోని అగ్నిమాపక సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ జరుగనుంది. రాష్ట్ర స్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లైవ్‌బోయ్ బోట్‌ను అందించిన శ్రీలత కంపెనీ ప్రతినిధులు మనోజ్ సావంత్, ఉమేష్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖ డివిజన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి 20 లైవ్‌బోయ్ బోట్లు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు ఇటీవల వచ్చిందని తెలిపారు. ఈ అధునాతన రిమోట్ ఆపరేటివ్ బోటు నిర్వహణపై ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇస్తున్నామని అన్నారు. ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మెలకువలను ఈ శిక్షణలో నేర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే విక్టిమ్ లోకేషన్ కెమెరా అందుబాటులో ఉందన్నారు. వరదల సందర్భంలో పాత ఇళ్లు కూలిన సమయంలో శిధిలాల కింద 10 మీటర్ల లోతులో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఈ కెమెరాను వినియోగిస్తామన్నారు. ఈ కెమెరాతో శిథాలాల కిందకు చిన్న రంధ్రం ద్వారా కెమెరా కేబుల్‌ను పంపించి పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కెమెరా విలువ దాదాపు 12 లక్షల వరకు ఉంటుందన్నారు.



మానేరు జలాశయంలో శిక్షణ పొందుతున్న ఫైర్ సిబ్బంది

కోరుట్లలో యువకుడి దారుణ హత్య

● పాత కక్షలే కారణం



బోయిన సాగర్ ఫైల్

కోరుట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం రోడ్డులో సోమవారం అర్ధ రాత్రి యువకుడు దారుణ హత్యకు గురా య్యాడు. ఆదే ప్రాంతంలో ఉండే యువకులు తరచుగా గొడవలకు పాల్పడేవారు. అవే కక్ష లు హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. తోటి స్నేహితుడితో వచ్చిన విబేధాల్లో సయో ధ్య కుదుర్చుకునేందుకు ఒక్క ప్రాంతానికి చేరుకున్న యువకుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ గొడవ కాస్త పెద్దదిగా మారి హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. పూర్తి వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన బోయిని సాగర్ అలియాస్ కళ్యాణ్, మంచోడు (32) అదే కాలనీకి చెందిన యువకులతో పాతకక్షలు ఉన్నాయి. సోమవారం సాగర్‌తో తన స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా కొందరు యువకులు అక్కడి చేరుకుని గొడవ పడ్డారు. వెంటనే గమనించిన చుట్టు పక్కల వారు 100 నంబర్‌కు సమాచారం అందించారు. బ్లూకోట్స్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి యువకులను సముదాయించి అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో మరోమారు యువకులు గొడవ దిగారు. ఈ క్రమంలో నలుగురు యువకులతో పాటు మరి కొంత మంది సాగర్‌పై దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. అందులోంచి ఓ యువకుడు కత్తితో సాగర్ మె డపై దాడికి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దాడికి పాల్పడ్డ వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్ బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్ఐలు శ్రీకాంత్ నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సాగర్ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత సంవత్సరం క్రితం జరిగిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ సింగ్ హత్య కేసులో సాగర్ నిందితుడు.

చొప్పదండి సహకార సంఘం సందర్శన



చొప్పదండి సహకర సంఘాన్ని సందర్శించిన అధికారుల బృందం

చొప్పదండి, అక్టోబరు15: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ డిసిసిబి బ్యాంకు అధికారుల బృందాలు మంగళవారం సందర్శించింది. క్షేత్ర సందర్శనలో భాగంగా ఈ బృందాలు సందర్శించి సంఘం పనితీరును పరిశీలించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువుల విక్రయాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘం లాభాల బాటలో పయనించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్నో బర్డ్ డీజీఎం రజనీ పాండే, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ డిజిఎం బ్రహ్మా నందరావు, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ సంఘం చైర్మన్ వెల్మ మల్లరెడ్డి, సీఈఓ తిరుపతి రెడ్డి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన వ్యవసాయ క్షేత్రాన్నే ప్రయోగశాలగా మార్చుకున్నాడు.. దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి వివిధ రకాల సాగు పద్ధతులను అధ్యయనం చేశాడు. ఇక్కడి భూములకు అనువుగా ఉండే విధానాన్ని రూపొందించుకుని కూరగాయల సాగును ప్రారంభించాడు. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదులుకున్నాడు. రాజీనామా పత్రంలోనూ కూరగాయల సాగు చేసేందుకు ఉద్యోగాన్ని వదిలిపెడుతున్నానని రాశాడంటే ఆయన ఎంత ఆత్మవిశ్వాసంతో అటువైపు అడుగులు వేశాడో అర్థం చేసుకోవచ్చు. అందరూ విచిత్రంగా చూసినా.. తను అనుకున్నది సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదన కొమురెల్లి. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన అనుభవాలను వివరించారు.. - తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

- నూతన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం
- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కూరగాయల సాగులోకి..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న కొమురెల్లి

వ్యవసాయ క్షేత్రమే ప్రయోగశాలగా..

అనుభవం



డ్రిప్ విధానంలో పండిస్తున్న కొతిమీర

నేను సాధారణ కుటుంబంలో జన్మించాను.. చిన్న వయసులోనే వివాహమైంది. ఇంటర్ వరకు చదివాను. అనంతరం టైప్, కంప్యూటర్ కోర్సు చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. అప్లై చేసుకుని ఉద్యోగం సాధించాను. 1995 నుంచి 1997 వరకు ఉద్యోగం చేశాను. అప్పుడు జీతాలు తక్కువగా ఉండేవి. ఇద్దరు పిల్లలు, భార్యను ఆ జీతంతో పోషించలేక ఇబ్బంది పడ్డాను. ఉద్యోగం చేసినా నా మనస్సు వ్యవసాయం వైపే లాగేది.



కూరగాయల సాగు చేయాలని, మన కాళ్లపై మనం నిలబడాలని అనుకునేవాడిని. రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత ఇక ఆ పనిలో కొనసాగలేనని అనిపించింది. వెంటనే రాజీనామా చేశాను. కూర గాయల సాగు చేసుకునేందుకే రాజీనామా చేస్తున్నానని లేఖలో రాశాను.. అందురూ నవ్వారు. సన్నిహితులు నచ్చజెప్పారు. అయినా వినలేదు. నా లక్ష్యం అదే అనుకుని ముందడుగు వేశాను. రాజీనామా చేసిన తర్వాత మా స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు చేరుకున్నాను. మాకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం ప్రారంభించాను.



వినూత్న పద్ధతుల్లో..

మా ప్రాంతంలో ఎక్కువగా వరి సాగు చేస్తారు. అందరికన్నా భిన్నంగా ఉండాలని నేను కూరగాయల సాగును ఎంచుకున్నాను. ఇందుకు చాలా కష్టపడ్డాను. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేశాను. ఎక్కడ కొత్త విధానంలో వ్యవసాయం చేస్తున్నారని తెలిసినా అక్కడికి వెళ్లాను. అన్నింటిని పరిశీలించి మన ప్రాంతానికి అనువైన పద్ధతిని రూపొందించుకున్నాను. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాను. నాకున్న భూమిలో అంతా ఒక్క పంట వేయకుండా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పండిచడం ప్రారంభించాను. మొదట్లో కొంత కష్టమైనా ఇష్టంగా పని చేశాను. తర్వాత అలవాటైంది. మొదటి రెండు సంవత్సరాలు చిన్నచిన్న ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో వాటన్నింటిని అధిగమించాను. కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చు. ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే నెలవారీగా ఆదాయం పొందవచ్చు.

ఎనిమిది మందికి ఉపాధి

ఒకప్పుడు కుటుంబసభ్యులం కష్టపడే వారం. రానురాను పంటలు పెరిగేసరికి ఇతరుల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మాతో పాటు ఎనిమిది మంది పని చేస్తున్నారు. నా భార్య అరుణ అన్ని పనుల్లో నాకు చేదోడు.. వాదోడుగా ఉంటుంది. నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహం జరిగింది. చిన్నమ్మాయి బెంగళూర్‌లో ఉద్యోగం చేస్తోంది. నేను పండించే పంటను మార్కెట్‌లో విక్రయిస్తా.

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం



పంటను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు కొమురెల్లి

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం. కూరగాయల సాగుతో మంచి లాభాలు ఆర్జించవచ్చు. కొత్తగా వ్యవసాయంలోకి వచ్చే రైతులు అవగాహన వచ్చే వరకు ఎక్కువ పెట్టుబడులు పెట్టొద్దు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడి పెట్టి వ్యవసాయం ప్రారంభించాలి. అవగాహన వచ్చిన తర్వాత విస్తీర్ణాన్ని పెంచుకోవాలి. అప్పులు తెచ్చి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడొద్దు. చాలా మంది రైతులు సేంద్రియ పద్ధతులు అంటే పెట్టుబడి ఎక్కువ పెట్టి పండిన పంటలను ఎక్కువ ధరకు విక్రయిస్తారు. నేను సాధ్యమైనంత తక్కువ పెట్టుబడి తో సాగు చేస్తాను. వినియోగదారులకు తక్కువ ధరకే అమ్ముతాను.

శాశ్వత పందిరి

కూరగాయల సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. నూతన పద్ధతులను గమనించాల్సి ఉంటుంది. నేను పెండల్స్, జీఐ వైర్ సహాయంతో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టి శాశ్వతంగా ఉండేలా పందిరి వేశాను. అంతకు ముందే ఎరువులు వేసుకుని మళ్లు ఎత్తుగా తయారు చేసుకున్నాను. మల్చింగ్ విధానంలో విత్తనాలు వేశాను. బిందు, తుంపర్ల విధానంలో మొక్కలకు నీటిని అందిస్తున్నాను. ఇది మంచి ఫలితాన్ని ఇస్తోంది. మంచి దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టమాట, బీర, మిర్చి, కాకర పంటలు పండిస్తున్నాను. కొత్తిమీర, ఇతర ఆకు కూరలు సాగు చేస్తున్నాను. వాతావరణ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుతుంటాను. సంవత్సరానికి ఒక పంట తీసే టమాట, మిర్చికి మూడు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తుంది. బీర, కాకర సంవత్సరానికి రెండుసార్లు పండుతాయి. ఒక్కో పంటకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు పోను ఏడాదికి 15 లక్షల రూపాయల వరకు సంపాదిస్తున్నాను. ప్రస్తుతం ఎకరం విస్తీర్ణంలో మిరప, ఎకరం టమాట, రెండు ఎకరాల్లో పందిరి కూరగాయలైన బీర, కాకరకాయలు, 20 గుంటల్లో కొత్తిమీర సాగు చేస్తున్నాను. వీటితోపాటు అంతరపంటలు సాగు చేస్తున్నాను. పందిరిపై ఉన్న పంట తీసివేసే సమయానికి ఎదిగేలా అంతర పంటలు వేస్తున్నా. అవి చేతికొచ్చే సమయానికి పందిరి కూరగాయాలు విత్తుకుంటాను. ఈ విధానం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.



తీగజాతి సాగు కోసం వేసిన శాశ్వత పందిరి



మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట



కొమురెల్లి సాగు చేసిన కాకర కాయ పంట

క్రీడా సమాచారం

18న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ కార్యాలయ ఆవరణలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎస్ మురళీధర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే 60 మంది క్రీడాకారులను మొదటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి అందులోంచి 15 మంది క్రీడాకారుల చొప్పున నాలుగు జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ జట్లుకు పోటీలు నిర్వహించిన ఆ మ్యాచ్‌లో విశేష ప్రతిభచాటే క్రీడాకారు లను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని వారు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు నవంబర్‌లో మెదక్, వరంగల్ జిల్లాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 1-9-2001 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు రెండు ఫొటోలు, జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావులకు రిపోర్టు చేయాలని సూచించారు.

20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను ఉదయం 9 గంటల నుంచి బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 22-11-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,900 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 172క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,900, కనిష్ఠ ధర రూ.6,100 పలికింది.

అండాళమ్మకు ఒడిబియ్యం

- లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



పట్టువస్త్రాలతో మున్సిపల్ చైర్‌పర్సన్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అండాలమ్మ వారికి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మావతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రతినిధులు సమర్పించారు. మార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఒడిబియ్యంతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, గుజ్జె తార, కాముని వనిత, అడెపు రవీందర్ పాల్గొన్నారు.

బర్నింగ్ ఇష్యూ

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాల డిమాండ్
- ఉద్యమానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు కళాశాలల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి. ఈ నెల 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 డిగ్రీ కళాశాలలు, 35 పీజీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. రెండు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రకపోవడంతో విద్యార్థులు, లెక్చరర్స్, విద్యార్థి సంఘాల నేతలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా జిల్లా వాప్తంగా 120 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.



జగిత్యాలలో మూసివేసిన డిగ్రీ కళాశాల

- **కష్టంగా మారిన నిర్వహణ**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడిన యాజమాన్యాలు ప్రైవేట్ కళాశాలలు నడుపుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఖర్చులన్నీ యాజమాన్యాలు భరించాల్సి వస్తోంది. మూడేళ్లగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలకు సిబ్బంది జీతాల చెల్లింపు, కాలేజీల నిర్వాహణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవదిక బంద్ నిర్వహిస్తున్నాయి.

- **విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘ నాయకుడు



ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ వాల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అకడమిక్ వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది కలుగుతుంది. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం వేంటనే స్పందించాలి. లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తాం.

- **ప్రభుత్వం స్పందించాలి**

వెంకటేశ్వర్రావు, డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



తప్పని పరిస్థితుల్లో నిరవధిక బంద్‌కు వెళ్లాల్సి వచ్చింది. మా ఉద్దేశ్యం విద్యార్థులను ఇబ్బంది పెట్టాలన్నది కాదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇస్తేనే కళాశాలలు మనుగడ సాగించగలు గుతాయి. విదార్థులు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది, కుటుంబాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

- **విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతోంది. కళాశాలల బంద్‌తో సెమిస్టర్ పరీక్షలు ఆలస్యయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

కల.. సాకారమవుతున్న వేళ..!

- వంతెన నిర్మాణంతో రామారావుపల్లె, ఇటిక్యాల గ్రామస్థుల హర్షం



పూర్తయిన వంతెన

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన పనులు తుది దశకు చేరాయి. రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు 530 జనాభా ఉంది. గ్రామస్థులు తమ అవసరాలకు నిత్యం రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో గోదావరి పెద్ద వాగు ఉండటంతో చుట్టూ సుమారు 10 కి.మీ. దూరం తిరిగి వెళ్తున్నారు. దశాబ్ధాల నాటి నుంచి ఈ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. బిల్లులు రాక పనులు మధ్యలో ఆగిపోగా, జనవరిలో మళ్లీ ప్రారంభించారు. పెద్ద వాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు పూర్తయ్యాయి. మరో మూడు మాసాల్లో వంతెన అందుబాటులోకి రానుండటంపై ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి నుంచి చిత్రపురికి

అసిస్టెంట్ కెమెరామన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణింపు



సినిమా చిత్రీకరణలో బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేస్తే సాధ్యం కానిదేమీ లేదని నిరూపిస్తున్నాడు ఇల్లంతకుంట మండలం అనంతగిరి కుర్రాడు. కళాకారుడిగా ఎదిగి స్థిరపడాలనే ఆశయంతో నిరంతరం శ్రమించాడు. లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంగా ముందుకు సాగుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన తిప్పరవేని మల్లమ్మ, రాజయ్య దంపతుల కుమారుడు బాలకిషన్‌కు చిన్నతనం నుంచి నాటకరంగంపై ఆసక్తి. మండలంలోని పలు గ్రామాల్లో నాటకాలు వేసినప్పుడు చిన్నచిన్న పాత్రలు పోషించే వాడు. దానికి తోడు ప్రకృతిని తన కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నాడు. సినీ రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ 15 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అనేక ప్రయత్నాల అనంతరం 2005లో నటుడు శ్రీకాంత్ హీరోగా నటించిన 'శ్రీకృష్ణదేవ రాయ' సినిమాకు తొలిసారిగా అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాడు. అనంతరం బాస్, స్టూడెంట్ నంబర్ 1, ఇంద్రాక్ష, తొలిపరిచయం, వారిధి వంటి సినిమాలకు పనిచేసి మంచి గుర్తింపు పొందాడు. ప్రభాస్ నటించిన 'మిర్చి' సినిమా వీడియో మేకింగ్ చేశాడు. 2016లో అన్నపూర్ణ బ్యానర్‌పై నిర్మించిన టీవీ సీరియల్ 'శశిరేఖ పరిణయం'కు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. 'పసిడి మొగ్గలు, జోగిని, వేడుక'లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించాడు.

2014లో హరితహారంపై బాలకిషన్ తీసిన డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం నుంచి మొదటి బహుమతి లభించింది. ఇటీవల కాలంలో యూట్యూబ్‌లో పలు పాటలు, సామాజి క అభివృద్ధి అడ్డంకిగా మారిన అం శాలపై దృష్టి కేంద్రీకరించాడు. స్థానిక కళాకారులతో షార్ట్‌ఫిలిమ్స్ తీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మపై తీసిన పాట ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇలా సినిమాలు, యూ ట్యూబ్ చానల్ లో బాలకిషన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు.



సినిమా షూటింగ్‌లో బాలకిషన్

సినిమారంగంలో రాణిస్తా

బాలకిషన్ తిప్పరవేణి, నటుడు, కెమెరామెన్, ఇల్లంతకుంట

సినిమారంగంలో ఇప్పటికే పలు చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాను. టీవీ సీరియల్స్‌లో ఆర్టిస్టుగా పనిచేశాను. సినిమారంగంలో రాణించడమే లక్ష్యం. అనేక ఇబ్బందులు ఎదుర్కొని ముందుకు సాగుతున్నా. స్థానిక కళాకారులతో యూట్యూబ్‌లో పాటలు, షార్ట్‌ఫిలిమ్స్‌తో మంచి గుర్తింపు లభిస్తోంది. అనంతగిరి గ్రామస్థులు, తల్లి దండ్రుల సహకారం మరువలేనిది.

అతి ఉత్కృష్ట పతకానికి ఎంపికైన జగిత్యాల డీఎస్పీ



జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :పోలీస్ శాఖలో విశేషమైన సేవలందించినందుకు గాను, మావోయిస్టు కార్యక లాపాలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకుగానూ కేంద్ర ప్రభుత్వం అందించే అతి ఉత్కృష్ట పతకానికి జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మంగళవారం రాత్రి డీఎస్పీని అభినందించి మాట్లాడారు. ప్రతి పోలీస్ అధికారి చట్ట పరిదిలో ప్రజలకు సేవలు అందించడంతో పాటు నీతి, నిజాయితీతో విధులు నిర్వహించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం డీఎస్పీ రఘు చందర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో క్రమ శిక్షణతో విధులు నిర్వహించడంతోనే అతి ఉత్కృష్ట పతకానికి ఎంపికైనట్లు వివరించారు.

అవగాహన..

మేడిపల్లి, అక్టోబర్ 15 : వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో వరి కోత యంత్రం (హార్వేష్టర్) యజమానులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ మాట్లాడుతూ వరి కోత సమయంలో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలు పంట నాణ్యత ప్రమాణాలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సురేందర్‌నాయక్, నరేందర్, సాయిప్రియ, స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కొడిమ్యాల, అక్టోబరు 15 : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలను, అదె గ్రామానికి నాలుగేళ్ల చిన్నారిని మంగళవారం కుక్క గాయపరిచింది. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని కుక్క గాయపరిచిందని చూడటానికి వెళ్లిన ఇద్దరు మహిళలను కూడా కుక్క గాయపరిచింది. వారిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఇజ్రాయిల్‌లో స్థిరపడిన కొడిమ్యాల గ్రామానికి చెందిన గుర్రం సురేష్ సువర్ణ దంపతులు 3లక్షల 50 వేల రూపాయల విలువైన స్టీల్ రేయిలింగ్‌ను ఏర్పాటు చేయించినట్లు పూజారి నాగరాజు రమేష్ మంగళవారం తెలిపారు. దాత కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలి

●ఎస్పీ అశోక్ కుమార్ ●మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయం తనిఖీ



మొక్క నాటుతున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలో భాగంగా మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఎస్పీ అశోక్ కుమార్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యలయంలో రికార్డులను, పరిసరాలను తనిఖీ చేసారు. కార్యాలయినికి సంబంధించిన సర్కిల్ సమాచార బుక్, క్రైం రికార్డు, ప్రాపర్టీ రిజిష్టర్, పిటిషన్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ శాంతి భద్రతలు పరిరక్షణ కు ఆయా ఎస్ఐల ద్వార చర్యలు చేపట్టాలని సీఐ నిరంజన్‌రెడ్డికి సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ సీఐ నిత్యం తనిఖీ చేయాలన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం సర్కిల్ కార్యాల యంలో ఎస్పీ మొక్కను నాటారు. ఆయన వెంట డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, డీసీఆర్‌బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

●ప్రశాంత వాతావరణంలో పండుగల నిర్వహణ

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :ప్రశాంత వాతావరణంలో పండు గలు నిర్వాహించుకున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దుర్గా నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టిన ఎస్పీ అశోక్‌కుమార్‌ను మంగళవారం విశ్వహిందూ పరిషత్, హిందూ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి షాలువాలతో సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగల నిర్వాహణకు సహకరించిన ప్రజలకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఇదే స్పూర్తితో పండుగలు జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ తరపున కావాల్సిన బద్రతాపరమైన ఏర్పాట్లు చేయడానికి ఎల్లప్పుడు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ సీఐ వేణు గోపాల్ ఉన్నారు.



ఎస్పీని సన్మానిస్తున్న హిందూ సంఘాల నాయకులు

ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసంపై నిరసన



మతోన్మాది దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హిందూ ఐక్య వేదిక నాయకులు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని కొందరు మతోన్మాదులు ధ్వంసం చేయడం పట్ల ధర్మపురి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. హిందూ ఐక్య వేదిక నాయకులు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విగ్రహాన్ని ధ్వంసం చేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చివరగా గాంధీ చౌక్ వద్ద మతోన్మాది దిష్టి బొమ్మను దగ్దం చేశారు. హిందూ ఐక్య వేదిక నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలోని దేవత మూర్తిని ధ్వంసం చేసిన ఆగంతకుడిని కఠినంగా శిక్షించాలని స్థానిక నాయకులు, యువకులు కోరుతున్నారు. మంగళవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద నాయకులు, యువకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఫాక్స్ చైర్మన్ నేరెళ్ల మోహన్‌రెడ్డి, నాయులు విష్ణువర్ధన్, రాజు, శేఖర్, అంజిరాజ్, సత్యం, లింగారెడ్డి, సాయికుమార్, ప్రతాప్, గంగారాం, అంజిరెడ్డి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ



వేములకుర్తిలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 15: ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, యామపూర్ గ్రామలలో మంగళవారం ఉదయం వరకు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగు పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నలుమూలల నుంచి ఆటపాటలతో ఆలరించారు. దాండియా నృత్యాలు, యువతుల ఆటపాటలు అందరిని అకట్టుకున్నాయి. ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని చెరువు వద్ద బతుకమ్మను నిమజ్జనం చేశారు. వెళ్లిరా గౌరమ్మ అంటు పాటుల పడి సాగనంపారు. ఆనంతరం కుటుంబ సమేతంగా సద్దులలో తీసుకువచ్చిన పిండి వంటలను ఆరగించారు.

మంత్రగాళ్లను చంపుతామంటూ వెలసిన పోస్టర్లు

మేడిపల్లి, అక్టోబర్ 15 : గ్రామంలోని మంత్రగాళ్లను చంపుతామంటూ గుర్తు తెలియని వ్యక్తులు అంటించిన పోస్టర్లు గ్రామంలో సోమవారం రాత్రి వెలిసాయి. మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అయిలమ్మ విగ్రహం వద్ద, గ్రామంలోని బస్టాండ్, ప్రధాన కూడళ్లలో వాల్ పోస్టర్లు వెయడంతో గ్రామంలో కలకలం రేగింది. విషజ్వరాల కారణంగా గ్రామంలో అనేక మంది జ్వరాన బారిన పడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపం చేందిన వారు ఎవరైనా పోస్టర్లు వేశారా లేక ఆకతాయిల పని అయి ఉంటుందా అని గ్రామస్తులు అంటున్నారు. పోలీసులు సీసీ పుటేజి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

భూమి కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం

కథలాపూర్, అక్టోబరు 15 : మండల కేంద్రం సమీపంలో దుంపెట శివారులో ఉన్న వరద కాలువకు సంబంధించిన భూమిని తమకు కేటాయించాలని కోరుతూ మంగళవారం మండల రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. పది సంవత్సరాలుగా మండల సంక్షేమ సంఘం కబ్జాలో ఉందని సదరు భూమిని కేటాయించి భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. దాదాపు రు. 10 లక్షలు వెచ్చించి భూమిని చదును చేసుకుని కంచె వేసుకుంటే దుంపెట గ్రామస్థులు అక్రమంగా చొరబడి కంచెను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోరుట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998-2000 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనంగా ఏర్పడి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. 24 ఏళ్ల అనంతరం కలిసిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం వారు చేస్తున్న వ్యాపారాలు ఉద్యోగాలపై చర్చించుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధన చేసిన గురువులను కలిసి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో ఇల్లు రిజిస్ట్రేషన్

●ఫేక్ సర్టిఫికెట్లపై ఎంపీడీవో విచారణ ● లోన్ కోసం తప్పుడు పత్రాల తయారీ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 15: కన్నతండ్రి 30 ఏళ్ల క్రితం చనిపోయాడని ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి ఇంటిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు ఓ కొడుకు. ఈ ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న కొడుకు మరణించగా బతికున్నప్పుడు కొడుకు ఆ ఆస్తిని కుదువ పెట్టి బ్యాంకు నుంచి అప్పు తీసుకున్నాడు. బ్యాంకు అధికారులు డబ్బుల రికవరీకి రావడంతో బతికున్న తండ్రి షాక్‌కు గురయ్యాడు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన సున్నపు పెద్ద ముత్తన్న గ్రామంలో 18-89 నెంబర్‌తో ఇల్లు ఉంది. పెద్ద ముత్తన్నకు రాకేష్ అనే కొడుకు ఉన్నాడు. రాకేష్ మద్యానికి బానిసై గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి తండ్రి పేరు మీద ఉన్న అస్తిని కాజేయాలనుకున్నాడు. తండ్రి మరణించినట్లు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి తన పేరు మీద ఓనర్ సర్టిఫికెట్ తీసుకోని ఇంటిని తన పేరుమీద 2022లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకుని మెట్‌పల్లి పట్టణంలోని ఓ ప్రవైట్ బ్యాంక్‌లో కుదువ పెట్టి 3 లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు. లోన్ తీసున్న కొద్ది రోజులు కిస్తీలు కట్టి ఆ తరువాత కట్టలేదు. ఇదిలా ఉండగా 5నెలల క్రితం రాకేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితం రికవరీ నిమిత్తం బ్యాంక్ సిబ్బంది రాకేష్ ఇంటికి రావడంతో తండ్రి ముత్తన్న ఖంగుతిన్నాడు. బ్యాంక్ సిబ్బందితో వాదనకు దిగాడు ఇల్లు తన పేరు మీద ఉంటే అప్పులు ఎలా ఇచ్చారని వాదించాడు. ఈ విషయమై ఈ నెల 2న ముత్తన్న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో చంద్రశేఖర్ ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు, రాకేష్ 29-11-2022 సంవత్సరంలో తీసుకున్న ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌కు సీరియల్ నెంబర్ 304 ఉందని ఆ ఏడాదిలో జీపీ రికార్డుల్లో 108 వరకే సర్టిఫికెట్లు జారీ చేసినట్లు రికార్డులు ఉన్నాయని తేలింది. సంతకాలకు పొంతన లేదని నిర్ధారించారు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్ గ్రామ పంచాయతీకి సంబంధించినది కాదన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ కార్యదర్శి రామకృష్ణ, ముత్తన్న వాంగ్మూలం తీసుకోని నివేదికలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

బతుకమ్మ ఘాట్ వద్ద పూల తొలగింపు



బతుకమ్మ పూలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వట్టివాగు వద్ద బతుకమ్మ ఘటు వద్ద బతుకమ్మ సంబరాల్లో భాగంగా నిమజ్జనం చేసిన పూలను మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ఆదేశాల మేరకు తొలగించారు. ఘాటఖ వద్ద పరిశుభ్రత పనులను చేపట్టి ఘాట్‌లో ఉన్న బతుకమ్మ పూలను ట్రాక్టర్‌లో వర్మీ కంపోస్ట్ షెడ్డుకు తరలించినట్లు కమిషనర్ తెలిపారు. పూలను కంపోస్ట్‌గా తయారు చేసి 45 రోజుల అనంతరం మొక్కలకు ఎరువు రూపంలో అం దిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్ పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

కథలాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గుంటి పెరమాళ్ళ సన్నిధిలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో మంగళవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్ర త్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు న్యావనంది శేఖర్ విరాళంగా అందించిన డప్పులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, పులి హరిప్రసాద్, పూంద్ర నారాయణరెడ్డి, వాకిటి రాజరెడ్డి, చిన్నారెడ్డి, శంకర్, స్వామి రెడ్డి, శంకర్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు రూ. 10,15,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమెమ్మెల్యే క్యాంపు కార్యాలంలో స్థానిక నాయకులతో కలిసి చెక్కులను అందజేశారు. 119 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు రూ. 1,19,13,804 విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, సత్యనారాయణ, రాజేష్ నాయకులు ఫహీం, ప్రభులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై సమీక్ష

మల్యాల, అక్టోబరు 15: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులు, నాయకులతో సమీక్షించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఖరారు కాని కొన్ని గ్రామాల కమిటీలను అప్పటికప్పుడే పూర్తి చేయించారు. అనంతరం మల్యాలకు చెందిన బొట్ల వంశీ అనే యువకుడు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు పాదం కోల్పోగా ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పొన్నంబక్కుల తిరుపతిగౌడ్ అనే వ్యక్తి కొన్నాళ్ల క్రితం గుండె పోటుతో మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వైద్యులపై దాడులను అరికట్టాలి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వైద్యులపై జరుగుతున్న దాడులను ప్రభు త్వం అరికట్టాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కలకత్తాల మహిళా వైద్యులపై జరిగిన దాడికి జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలకత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన ఆకృత్యాన్ని హేయమైన చర్యగా అభివర్ణించిన ఆయన ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడులు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోటగిరి సుధీర్ కుమార్, వొడ్నాల రజిత, తాటిపాముల సురేష్, భీమనాతిని శంకర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వైద్యుడు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని అన్నమయ్య అసుపత్రి అధినేత డాక్టర్ ముత్యాల వెంకటరెడ్డి మంగళవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్వ ర్యంలో బీజేపీలో చేరారు. నిజామాబాద్ ఎంపీ కార్యాలయంలో ఎంపీ అర్వింద్‌ను కలిసి పార్టీలో చేరారు. గతంలో వెంకటరెడ్డి లోక్‌సత్తా పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం టీఆర్ఎస్ పార్టీలో కొనసాగారు. దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు తెలిపారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ నరేందర్ రెడ్డి, రైతు నాయకులు బోతుకూరి రాజరెడ్డి, రాజరెడ్డి, బద్దం గంగాధర్ పాల్గొన్నారు.

అధ్వానంగా చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ లింక్ రోడ్డు

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇరు గ్రామాల ప్రజలు



గుంతలమయంగా మారిన రహదారి

కోరుట్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్-చిన్నమెట్‌పల్లి గ్రామాలకు ఏర్పాటు చేసిన లింక్ రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లేం దుకు రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. చిన్నమెట్‌పల్లి నుంచి కోరుట్ల మండల కేంద్రానికి రావడానికి తక్కువ దూరం కావడంతో గ్రామస్థులు ఈ లింక్ రోడ్డును ఎంచుకుంటారు. మండల కేంద్రానికి రావడానికి సుమారు మూడు కిలో మీటర్ల మేర దూర భారం తగ్గుతుంది. దీంతో పాటు ఇరు గ్రామాలకు చెందిన రైతులు ఈ రోడ్డు నుంచి వ్యవసాయ క్షేత్రాలకు వెల్లడానికి రహదారిని ఆశ్రయిస్తుంటారు. సంవత్సరం గడిచిన రోడ్డు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో తరచు ప్రమాదాలు చోటు చేసున్న సంఘటనలు ఉన్నాయి. ఇప్పడికైన అధికారులు చోరువ చూపి చిన్నమెట్‌పల్లి-వెంకటాపూర్ లింక్ రోడ్డు మరమ్మతులు చేసి గ్రామస్థుల ఇబ్బందులు తొలగించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మూగజీవాలకు వ్యాధులు సోకకుండా

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు మూగజీవాలకు వ్యాధులు సోకకుండా ముంద స్తు జాగ్రత్తల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకాల ను వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ సూచించారు. పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చౌలమద్ది, వెల్లుల్ల గ్రామాల్లోని బర్రెలు, ఎద్దులు, ఆవులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసి రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మూగజీవాలకు వైరస్ వల్ల వచ్చే అంటువ్యాధి సోకిన పశువు నుంచి మరొక పశువులకు గాలి ద్వారా వ్యాప్తి చేందే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలను వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తీగల లిం గారెడ్డి, రాంరెడ్డి, శేఖర్, పశువైద్యాధికారులు ము రళి, రమ, చిరంజన్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్‌కలాం జయంతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మెట్‌పల్లి విశాల సహకార సంఘం మాజీ చైర్మన్ మారు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని, యువత కలలు కని వాటిని సహకారం చేసుకోవాలని ఇచ్చిన పిలుపును పాటించి భవిష్యత్‌లో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, సంజీవ్, మారుతి, మహేష్, రాజేష్, శ్రీధర్, రవి, భాను, శ్రీనివాస్, యువత పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి బీమా పత్రాలు అందజేత

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చౌలమద్ది గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ బీమా పత్రాలు అందజేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందికి బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే అభివృద్ధి పనుల్లో ముండే సిబ్బంది జీవితంపై భరోసా కల్పించడానికి బీమా సౌకర్యం కల్పించామన్నారు. గ్రామంలోని కాలనీల్లో పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, కారోబార్ వాసాల రాములు, సిబ్బంది నర్సయ్య, సాహెబ్, శ్రీనివాస్, చిన్ననర్సయ్య పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో మేక మృతి

కథలాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో కోట గంగాధర్ అనే గొర్రెల కాపరికి చెందిన మేక విద్యుత్‌షాక్‌తో మృతి చెందింది. కాపరి ఎప్పటి మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో మేక అక్కడికక్కడే మృతి చెందిందని బాధితుడు తెలిపారు. ఈ ఘటనలో రు. 15 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

సిబ్బందితో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్



రికార్డులు పరిశీలిస్తున్న జగిత్యాల డీఎస్పీ

బీర్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, 100 డైల్ కాల్స్‌కు త్వరగా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, బీర్‌పూర్ ఎస్సై కుమార స్వామి, ఏఎస్ఐలు గజేందర్, రవీందర్, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసును విచారించిన డీఎస్పీ

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన పాలెపు సురేష్‌ను ఇదే గ్రామానికి చెందిన ఆకుల మల్లేశం, నందగిరి గోపాల్ కులం పేరుతో దూషించి చేతులతో కొట్టారు. ఈ విషయంపై సురేష్ ఫిర్యాదు మేరకు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా విచారణ నిమిత్తం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గ్రామంలో విచారణ చేపట్టారు.